## క్లుప్తంగా

### అన్నదానం



కమలాపూర్ : గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండల కేంద్రంలోని గుడిబండ వద్ద శ్రీ కంఠమహేశ్వర కళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద భక్తులకు దాతలు పబ్బు రాణి–సతీష్ దంపతులు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ పాలకుర్తి మాధవి ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు. తొలుత తహసీల్దార్ మాధవి వినాయకుడికి పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఓ రమేష్, ఏఈఓ సరిత, కళా మండలి గౌరవ అధ్యక్షుడు బాలసాని దేవేందర్, అధ్యక్షుడు మండ భిక్షపతి, ప్రధాన కార్యదర్శి దూలం తిరుపతి, ఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి ఓదెలు, సభ్యులు డాక్టర్ పబ్బు సాంబయ్య, మల్లేష్, వీరగౌడ్, అశోక్, మండ రాజేష్, పచ్చిమట్ల రాజయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ



కమలాపూర్ : మండలంలోని భీంపల్లి, లక్ష్మీపూర్ గ్రామాలకు చెందిన కురిమిండ్ల లక్ష్మయ్య, మటికె పీరయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర నాయకుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ శుక్రవారం పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ డైరెక్టర్ పల్లె వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకులు భూపతి ప్రవీణ్, పిల్లి సతీష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

### 28న రక్తదానం

పరకాల : తలసేమియా బాధిత బాలల కోసం మిలాద్ ఉన్ నబి (మహ్మద్ ప్రవక్త) జయంతి సందర్భంగా ఈనెల 28న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు యాక్ జిల్లా అధ్యక్షుడు ముస్తాఫా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేసే ఆసక్తి కలిగిన వ్యక్తులు సెల్ నంబర్ 8639865411, 9866744204ల్లో సంప్రదించాలని కోరారు. సమాజంలోని ఆరోగ్యవంతులైన యువత రక్తదానానికి ముందుకు రావాలని తెలిపారు.

### చదువుకు పేదరికం అడ్డు కాకూడదు

హన్మకొండ: చదువుకు పేదరికం అడ్డు కాకూడదని, పేద విద్యార్థులను వైద్యులుగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక వైద్య కళాశాలను స్థాపించారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్న హనుమకొండ రాంనగర్‌కు చెందిన హర్షవర్ధిని, రెడ్డి కాలనీకి చెందిన కీర్తనను దాస్యం వినయ్‌భాస్కర్ సన్మానించి ఆర్థిక చేయూతనందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తాడిశెట్టి విద్యాసాగర్, నల్ల సుధాకర్‌రెడ్డి, సుగుణాకర్, చీకటి ఆనంద్ పాల్గొన్నారు.

### అహ్మద్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ విభాగం పరిశోధకుడు ఖాజా శుజాత్ అహ్మద్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. టెస్టింగ్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ ఇంగ్లిష్ ఇన్ ఇంజనీరింగ్ కాలేజెస్ ఇన్ టీఎస్ అండ్ ఏపీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి అహ్మద్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఇంగ్లిష్ విభాగం ప్రొఫెసర్ దీపాజ్యోతి పర్యవేక్షణలో అహ్మద్ తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

### ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

హన్మకొండ: చట్టసభలో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రధానమంత్రి మోదీకి ఆయన లేఖ రాశారు. ఆ లేఖను హనుమకొండలో శుక్రవారం విడుదల చేసి మాట్లాడారు. ప్రధాని చొరవ చూపితే రిజర్వేషన్లు అమలుకు నోచుకుంటాయన్నారు. సమావేశంలో బీసీ జేఏసీ నాయకులు డాక్టర్ రాంబాబు, డాక్టర్ నరేందర్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు ఘంటసాల గానావధానం

రామన్నపేట: ఈనెల 24న పోతన ఆడిటోరియంలో ఒడిశా రాష్ట్ర కళాకారులతో ఘంటసాల గానావధానం, పాటల గాన విభావరి, జీవిత ఘట్టాలను తెలిపే లఘునాటికల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ కోలహాలం రామ్‌కిశోర్ తెలిపారు. వరంగల్ కాకతీయ థియేటర్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ రహమతుల్లా, డాక్టర్ ఆనంద్‌బొక్రె పాల్గొన్నారు.

# సభ్యుల సంక్షేమమే ధ్యేయం

● 67వ వార్షిక సభలో అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి



మహాసభకు హాజరైన సభ్యులు



మాట్లాడుతున్న అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : సభ్యుల సంక్షేమమే ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం ధ్యేయమని అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. భీమదేవరపల్లి మండలంలో ఆ సంఘం 67వ వార్షిక మహాసభ శుక్రవారం నిర్వహించారు. తొలుత సంఘం రుణాల విభాగ మేనేజర్ గొల్లపల్లి రాజమౌళి వార్షిక నివేదికను సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి మాట్లాడారు. సంఘంలోని అన్ని అంశాలనూ పారదర్శకతతో సభ్యులకు మేలు చేసేలా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది రూ.365 కోట్ల ఆర్థిక లావాదేవీలు చేపట్టగా రూ.7 కోట్ల నికర లాభం వచ్చిందన్నారు. ఇందులో రూ.3.30 కోట్ల బోనస్‌ను సభ్యులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్, డెంటల్, ఫార్మసీ తదితర విద్య అభ్యసిస్తున్న సభ్యుల 91 మంది పిల్లలకు రూ.11.50 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. సీనియర్ సభ్యులకు రూ.600లు చొప్పున 619 మందికి మొత్తం రూ.42 లక్షలు పంపిణీ చేశామన్నారు. ఈ పింఛన్‌ను వచ్చే నెల నుంచి రూ.800లకు పెంచుతున్నట్టు తెలిపారు. 320 మంది సభ్యుల కంటి అపరేషన్‌కు రూ.15 లక్షలు వెచ్చించామని, 147 మంది సభ్యులు చనిపోతే దహన సంస్కారాల కోసం రూ.25.85 లక్షలు అందజేశామని చెప్పారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా సభ్యులకు రూ.10.55 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలు 99 శాతం తిరిగి చెల్లించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సభ్యులు పరస్పర సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు చీకట్ల రాజయ్య, డైరెక్టర్లు కూన కనకయ్య, కదారి ఆదాం, మారుపాటి జయపాల్‌రెడ్డి, అంబాల రాములు, గజ్జి వీరయ్య, బేల కనుకమ్మ, అన్నం తిరుపతిరావు, కంది రవిందర్ రెడ్డి, గద్ద అయిలయ్య, ఆర్.వెంకటరెడ్డి, ఈర్ల మూగయ్య, కంకల భాగ్య, బానోతు కిషన్, జీఎం మారుపాటి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కవితను కలిసిన చైర్మన్



ఎమ్మెల్సీ కవితతో ప్రవీణ్ రవీంద్ర, గ్రామస్తులు

ధర్మసాగర్ : ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మండలంలోని ముప్పారం గ్రామస్తులు ముఖ్యనాథ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర, గ్రామస్తులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యనాథస్వామి ఆలయ పునప్రాణప్రతిష్ఠ నవంబర్‌లో నిర్వహిస్తామని ఆమెకు చెప్పారు. ముహూర్తం ఖరారయ్యాక ఆహ్వాన పత్రిక అందజేస్తామన్నారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్సీ కవితకు వివరించారు. గ్రామంలో ఈసారి జరిగే బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనెల సమ్మక్క రాజయ్య, ఉపసర్పంచ్ వేముల కొండ రజిత భిక్షపతి, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మేకల విజయ్‌కుమార్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కొన్నె రవీందర్‌రెడ్డి, దారపు రాములు, కోశాధికారి కుడితాడి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో దూడ మృతి



శాయంపేట : మండలంలోని రాజుపల్లి రైతు మల్యాల ప్రసాదరావుకు చెందిన దూడ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత రైతు కథనం ప్రకారం.. రోజు మాదిరిగానే ఉదయం పాడి గేదెను, దూడను బర్రెల మందలోకి ప్రసాదరావు పంపించారు. అవి మందలో నుంచి తప్పిపోయి ప్రసాదరావు ఇంటి వెనకాల ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేసుకుంటూ వెళ్లి ఎర్త్‌వైర్‌కు తాకి విద్యుదాఘాతానికి గురయ్యాయి. అవి విలవిలలాడుతుండగా లైన్‌మెన్ సంపత్‌కు సమాచారం అందించగా విద్యుత్ సరఫరా నిలిపేయగా పాడి గేదే బతికి బయటపడగా దూడ అక్కడికక్కడే మృతి చెందింది. తనకు సుమారు రూ.10 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు ప్రసాదరావు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు తనకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరాడు.

# ఉప్పల్ మండలం ఏర్పాటు చేయాలి



హరీష్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కమలాపూర్ : కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని మండల సాధన పోరాట సమితి జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు జేఏసీ కన్వీనర్ నాయినేని తిరుపతిరావు ఆధ్వర్యంలోని బృందం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం మంత్రితో తిరుపతిరావు మాట్లాడారు. మండల ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించారు. అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ మారపెల్లి నవీన్‌కుమార్, సభ్యులు ఎర్రబెల్లి శ్రీధర్‌రావు, కొనుపుల రాంచందర్, మొండెద్దుల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## 'బీఆర్ఎస్‌లో మోసపూరితంగా చేరికలు'

ఐనవోలు : అధికార పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరితే సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామంటూ మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మె మహేందర్ విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితబంధు, ఇతర పథకాల లబ్ధి చేకూర్చుతామంటూ మోసపూరిత హామీలతో పలువురిని బీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. నందనం గ్రామం నుంచి బీఆర్ఎస్‌లో చేరిన దళితులకు రూ.10 లక్షలు చొప్పున దళితబంధు మంజూరు చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు హితవు పలికారు.

# 'గృహలక్ష్మి'లో రాజకీయాలు తగదు

● బీజేపీ ఇన్‌చార్జ్ విజయ్‌చందర్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

సంగెం: గృహలక్ష్మి పథకం అమలులో రాజకీయాలు తగదని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఆ పథకాన్ని వర్తింపజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని షాపూర్‌లో శుక్రవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో విజయ్‌చందర్‌రెడ్డి పాల్గొని ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలనూ విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే పల్లెల్లో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. పార్టీ గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, బెజెంకి శేషాద్రి, ఎండీ. రహమతుల్లా, వీరయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు

దామెర : యువకుడిపై పోక్సో కేసు నమోదైన ఘటన మండలంలోని ఊరుగొండలో శనివారం చోటుచేసుకుంది. పరకాల రూరల్ సీఐ మల్లేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమిస్తున్నానంటూ ఆర్నెళ్లుగా వెంట పడుతున్నాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువకుడు ఇంట్లోకి చొరబడి మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. ఎవరికైనా చెబితే బాలిక తమ్ముణ్ని చంపుతానని బెదిరించాడు. దీంతో బయపడిన బాలిక ఎవరికీ చెప్పకుండా మౌనంగా, ఆందోళనతో ఉండగా గమనించిన తల్లిదండ్రులు నిలదీయడంతో జరిగిన విషయం చెప్పింది. దీంతో బాలిక తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మహిళా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

మడికొండ: మహిళా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని మడికొండలోని రాజరాజేశ్వరి గార్డెన్‌లో, భట్టుపల్లిలోని ఏజీఆర్ గార్డెన్‌లో మహిళా సంఘాల వార్షిక మహాసభలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శుక్రవారం హాజరై మాట్లాడారు. పావలా వడ్డీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే రుణాలను కుటుంబ అవసరాలకు కాకుండా ఆర్థిక ప్రగతికి ఉపయోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా సమితి అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్, పీఏసీఎస్ దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, 44, 45, 46, 64వ డివిజన్ల కార్పొరేటర్లు జలగం అనిత, ఇండ్ల నాగేశ్వర్‌రావు, మునిగాల సరోజన, ఆవాల రాధికరెడ్డి, డివిజన్ల అధ్యక్షులు రమేష్, దువ్వ శ్రీకాంత్, బొల్లికొండ వినోద్‌కుమార్, గాండ్ల భిక్షపతి, కాళేశ్వరపు రాజేందర్, వెన్నమల్ల రమేష్, బోగి లింగమూర్తి, పెనుకుల రవీందర్, దువ్వ నవీన్, ఈదురు అనిల్, మెప్మా అధికారులు టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్‌కుమార్, టౌన్‌మెషిన్ కోఆర్డినేటర్ రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీనివాసులు, శ్రీలత, జీవనజ్యోతి, ఆర్పీలు విమల, వీఓలు, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

## అనాథలకు ఉచిత వసతి

హన్మకొండ అర్బన్ : భోగవల్లి రాజేశ్వర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న ఆర్ఫనేజ్ హోమ్‌లో 6 నుంచి 18 ఏళ్ల వరకు వయస్సున్న మగ పిల్లలకు ఉచిత చదువు, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను వసతి గృహంలో చేర్పించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 98494 44454, 91544 66212, 97010 47002ల్లో సంప్రదించాలని సూచించారు.

# స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కేయూ క్యాంపస్ / హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మిశ్రిన్ సుల్తానా, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.5 వేల కోట్ల దాకా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. అవి రాకపోవడంతో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ అనూష, జిల్లా కమిటీ సభ్యురాలు మయూరి, సభ్యులు మంద వికాస్, ప్రవీణ్, రాజ్‌కుమార్, సందీప్, సాయికుమార్, నవీన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## యూబ్లడ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

హసన్‌పర్తి: ప్రతీఒక్కరు యూబ్లడ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఇతరులకు అవగాహన కల్పించాలని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ కోరారు. ఎర్రగట్టు గుట్ట సమీపంలోని షైన్ రెసిడెన్షియల్ పాఠశాలలో యూబ్లడ్ యాప్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూ బ్లడ్ యాప్.. ప్రాణపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి రక్తదాతలకు మధ్య వారధిగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు జక్కుల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'వడ్డీలకు సరిపోని ప్రభుత్వ సహాయం'



హన్మకొండ: మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న సాయం వడ్డీలకే సరిపోవడం లేదని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ధర్ముల రామ్మూర్తి అన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద పాఠశాల మధ్యాహ్న భోజన వర్కర్లు ధర్నా చేశారు. రామ్మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట చేసే వర్కర్లు కటిక దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నాకు సీపీఐ జిల్లా నాయకులు రవి, ఐలయ్య సంఘీభావం తెలిపారు.

# స్వయం ఉపాధితో అభివృద్ధి



మహిళలతో మసీయుద్దీన్, తదితరులు

దామెర : స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని జనశిక్షణ సంస్థాన్ (జేఎస్ఎస్) డైరెక్టర్ మహ్మద్ ఖాజా మసీయుద్దీన్ తెలిపారు. మండలంలోని దామెర, పులుకుర్తి గ్రామాల్లో కుట్టుమిషన్, బ్యూటీషియన్, జ్యూట్ బ్యాగుల తయారీ, పోషకపదార్థాల తయారీలపై ఆ సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలల ఇచ్చిన శిక్షణ ముగింపు సందర్భంగా మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మసీయుద్దీన్ మాట్లాడారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని వ్యాపారాల్లో రాణించాలని సూచించారు. లాభసాటి వ్యాపారం కోసం మెళకువలు పాటించాలని చెప్పారు. తద్వారా మెరుగైన ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ తిరుపతి, ఏపీఓలు రాజు, సుజీత్, జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ గండు రాము, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, దళితబంధు మండల చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, నాయకులు దాడి మల్లయ్య, జన్ను మల్లయ్య, రిసోర్స్‌పర్సన్లు దామెరుప్పుల సంధ్యారాణి, హింగె సువత, అంగన్‌వాడీ టీచర్లు రజిత, గౌరీ, రమాదేవి, వనజ, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే ప్రజలకు సుపరిపాలన



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

ధర్మసాగర్ : కాంగ్రెస్ పార్టీ ద్వారానే ప్రజలకు సుపరిపాలన అందుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బొల్లేపల్లి కృష్ణ స్పష్టం చేశారు. మండలంలోని కరుణాపురంలో 'గడప గడపకు కాంగ్రెస్' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించి మాట్లాడారు. ప్రజల మనోభావాలను గౌరవించి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలిచి అధికారంలోకి వస్తే ప్రజల సంక్షేమం కోసం ఆరు కొత్త పథకాలను ప్రకటించిందని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతినెలా రూ.2500లు నగదు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, తదితర అనేక పథకాలను కాంగ్రెస్ చేపట్టనుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బేతి జయపాల్‌రెడ్డి, తూటి నర్సింహారెడ్డి, శిఖ రాజు, సునీల్ కుమార్, వినీత్ కుమార్, నగేష్, స్టీవెన్, భీమగౌండి రాజు, అశోక్, రాజప్ప, చింత రాజు, మట్టెడ రవి, మట్టెడ స్వామి, శేషుకుమార్, సునీల్, ప్రేమ్ కుమార్, రాజమణి, జోత్స్న, అయ్యప్ప శ్రీను, అప్పని సంపత్, కొరివి సతీష్, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా డీఎస్పీ అభ్యర్థి ప్రచారం



దామెరలో ప్రచారం చేస్తున్న రమేష్

దామెర : ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) పరకాల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పూరెళ్ల రమేష్ మండలంలోని దామెర, పసరగొండ, ఊరుగొండ గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దామెరను మండలంగా ప్రకటించి అభివృద్ధిని విస్మరించిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అగ్రకుల అధికారాన్ని కూలదోయాలని సూచించారు. తనకు ఒక అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూలమాల రాజు, పాదయాత్ర ఇన్‌చార్జ్ రత్నాకర్, జిల్లా నాయకులు మేకల యుగేందర్, నియోజకవర్గ నాయకులు దామెర బాబురావు, కోడెపాక ప్రతాప్, చుక్క జానీ, విష్ణు, రమేష్, దయాకర్, వినీల్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు మరమ్మతు చేయాలని ధర్నా

గీసుకొండ : మండలంలోని మనుగొండ నుంచి ఆత్మకూరు మండలంలోని నాగయ్యపల్లెకు వెళ్లే రోడ్డుకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) ఆధ్వర్యంలో శిధిలమైన ఆ రోడ్డు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ఫ్రంట్ నాయకులు మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గండిపడి ధ్వంసం అయ్యిందని తెలిపారు. నాటి నుంచి ప్రయాణికులు, వాహనదార్లు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, రాష్ట్ర కార్యదర్శులు పులి కల్పన, చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షులు మాదాసి సురేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఈ-పంచాయతీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు

కరీమాబాద్: వరంగల్ జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న ఈ - పంచాయతీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ కలెక్టరేట్ కార్యాలయం ఏఓ శ్రీకాంత్‌కు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దివ్య ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అలాగే, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో ఏఓ జయలలితకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 –15 నుంచి ఈ- పంచాయతీ ఆపరేటర్లుగా పనిచేస్తున్న తమకు ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తింపజేయడమే కాకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, శైలజ, రమేష్, బాబు, గుణశ్రీ, సురేష్, ప్రణవ్, నవీన్, సతీష్, సురేష్, షబానా, సునీత, అనిత, స్రవంతి, మౌనిక, సరిత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానవంతులకు ఉద్యోగావకాశాలు మెండు



ఆనంద్ కిశోర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

హన్మకొండ అర్బన్: జ్ఞానవంతులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్ అన్నారు. నగరంలోని వడ్డేపల్లి పింగిళి మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన ఫిజికల్ సైన్స్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటితరం విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులుగా ఉంటేనే ఈ పోటీ ప్రపంచంలో రాణించగలుతారని తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్‌ను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ విభాగాధిపతులు స్నేహలతారెడ్డి, మాధవి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ పార్వతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఫార్మకో విజిలెన్స్‌పై అవగాహన

హన్మకొండ కల్చరల్: మూడవ నేషనల్ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని ఫార్మకో విజిలెన్స్‌పై ప్రజలకు భద్రకాళి దేవాలయంలో వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. సదస్సులో అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, పర్యవేక్షకులు అద్దంకి విజయ్‌కుమార్, ఫార్మకో విజిలెన్స్ రీసెర్చ్ అసోసియేట్ శ్రీనివాస్, వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.